వరంగల్
వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 319 | శనివారం | 06 జూలై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## పారిశ్రామిక వేత్త జయప్రకాశ్‌కు ఘన సన్మానం



బెంగుళూరులో స్థిరపడిన ఓరుగల్లు ముద్దు బిడ్డ, ప్రముఖ పారిశ్రామిక వేత్త బాసాని జయప్రకాశ్ శనివారం వరంగల్ వాయిస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, న్యూస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, దుబాసి రవిందర్ శాలువాతో ఘనంగా సత్కరించారు.
– వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు 2లో..




# తాటతీస్తా..

## ఎంజీఎం జబ్బుకు కలెక్టర్ చికిత్స

హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ పెద్దాసుపత్రి వరంగల్ నగరంలోని ఎంజీఎం. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు చుట్టు పక్కల జిల్లాలకు చెందిన నిరుపేద రోగులకు ఈ ఆసుపత్రే పెద్ద దిక్కు. వెయ్యి పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రి అనేక సమస్యలకు నిలయంగా మారింది. పాలన గాడి తప్పడంతో డాక్టర్లు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో రోగుల ప్రాణాలమీదికి వస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఎంజీఎంను నిమ్స్ స్థాయిలో అభివృద్ధి చేస్తామంటూ గత పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారడంతో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే జబ్బు పట్టిన ఎంజీఎంకు చికిత్స చేసేందుకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రంగంలోకి దిగారు. స్వయాన డాక్టర్ అయిన ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి అధికారులు, డాక్టర్లు, సిబ్బందికి చెమటలు పెట్టించారు. మెరుగైన వైద్యం అందించకపోతే తాటతీస్తానన్నట్లుగా హెచ్చరికలు జారీ చేశారు. అయితే దేశ ముదుర్లున్న ఎంజీఎంను కలెక్టర్ గాడిన పెట్టేనా లేక అందరిమాదిరిగానే హల్ చల్ చేసి సైడైపోతారా అన్న చర్చ సాగుతోంది. - వరంగల్ వాయిస్, వరంగల్





**ఆకస్మిక తనిఖీతో హల్ చల్**

**గైర్హాజరైన వైద్యులకు షోకాజ్ నోటీసులు**

**రిజిస్టర్ లో సంతకం చేసి విధులకు డుమ్మా కొట్టిన వారి సస్పెన్షన్‌కు సిఫారసు**

**నాణ్యమైన వైద్యం అందించాలంటూ సూచన**



8లో

## ఆషాఢ బోనాలకు రూ.20 కోట్లు

విడుదల చేసిన ప్రభుత్వం

అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తాం

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

## తెలంగాణ ధిక్కార స్వరం ప్రణయ్ భాస్కర్

| కార్పొరేటర్ అభినవ భాస్కర్ | బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ | పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ |
|---|---|---|





8లో..



# తాటతీస్తా..









## ఎంజీఎం జబ్బుకు కలెక్టర్ చికిత్స

### ఆకస్మిక తనిఖీతో హల్ చల్

### గైర్హాజరైన వైద్యులకు షోకాజ్‌నోటీసులు

### రిజిస్టర్ లో సంతకం చేసి విధులకు డుమ్మా కొట్టిన వారి సస్పెన్షన్‌కు సిఫారసు

### నాణ్యమైన వైద్యం అందించాలంటూ సూచన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రి ప్రక్షాలనకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నడుం భిగించారు. శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి డాక్టర్లు, సిబ్బందికి ముచ్చెమటలు పెట్టించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును కలియ తిరుగుతూ అక్కడ ఎంతమంది సిబ్బంది ఉండాలి.. అందులో ఎంతమంది ఉన్నారు.. మిగిలిన వారు ఎక్కడ అంటూ ఆరా తీశారు. విధులకు డుమ్మా కొట్టిన డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను సేకరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధి నిర్వహణలో సమష్టిగా పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షనే ధ్యేయంగా అంకితభావంతో వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని ఓపీ జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, సైక్రియాటిక్, న్యూ మేల్ సర్జికల్ వార్డ్, ఇంటెన్సివ్ కేర్ సర్జికల్ యూనిట్, పిల్లల ఐసీయూ, పీఐసీయూ, ఎస్ఎన్ సీయూ, సెంట్రల్ ల్యాబ్, రేడియాలజీ, ఎమర్జెన్సీ క్యాజువాలిటీ తదితర విభాగాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఆయా వార్డుల్లో అందిస్తున్న సేవలు రోగులను అడిగి తెలుసుకున్నారు.

### సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు..

ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది గురించి ఆరా తీశారు. సరైన సమయానికి సిబ్బంది వైద్యులు హాజరై వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రులు అవసరమయ్యే మందులు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్ లో ముందస్తుగానే జులై నెల మొత్తం రోజులు సంతకం చేసిన డాక్టర్ ను సస్పెండ్ చేయాలని కోరుతూ డీఎంఈకి కలెక్టర్ సత్య శారద సిఫారసు చేశారు. అన్ని విభాగాల హాజరు రిజిస్టర్ బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించి, గైర్హాజరైన డాక్టర్లు, సిబ్బందికు షో కాజ్ నోటీసులు జారీ చేశారు. అదే విధంగా డాక్టర్లు, సిబ్బందిపై పర్యవేక్షణ, నియంత్రణ కోల్పోవడానికి గల కారణాలు తెలుపాలంటూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ను సంజాయిషీ కోరారు.

### రికార్డుల పరిశీలన..

ఓపి సేవలు, ఆన్లైన్ రిజిస్ట్రేషన్ లను కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. రోజుకు ఎన్ని ఓపీలను చూస్తున్నారు. ఆసుపత్రిలో పేషెంట్లకు శుభ్రమైన తాగునీరు అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. ల్యాబ్ విభాగాన్ని తనిఖీ చేసి డయాగ్నొస్టిక్స్ పరీక్షల రికార్డులను తనిఖీ చేశారు. ఐసీయూ, వెంటిలేటర్లకు సంబంధించిన పరికరాలపై కలెక్టర్ ఆరా తీశారు. అలాగే చిన్న పిల్లల విభాగాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేసి వారికి అందుతున్న వైద్య సేవలను పిల్లల తల్లిదండ్రులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలంటూ సూచించారు. డెంగ్యూ ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలన్నారు.

### మెరుగైన సేవలు అందించాలి..

అనంతరం డీఎంఈ డాక్టర్ వాణితో కలసి కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆసుపత్రి హెచ్ఓడీలతో ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఆకస్మిక తనిఖీలో గుర్తించిన అంశాలు, లోపాలపై వివరించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డీఎంఈని కలెక్టర్ కోరారు. వివిధ విభాగాల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించారని గుర్తు చేశారు. ఇది ఆరంభం మాత్రమే అంటూ హింట్ ఇచ్చారు. ఇకముందు ఇలాంటి తనిఖీలు ఉంటాయన్న హెచ్చరికను జారీ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎంఓ మురళి, శ్రీనివాస్, అన్ని విభాగాల హెచ్ఓడీలు, తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన సేవలు అందించాలి

### ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణాలు, మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్, ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్ కడియం కావ్య, కడియం శ్రీహరిలను శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్లు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు శశికాంత్, వెంకన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పగటి కలలు మానాలి

### ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కూరపాటి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం దురహంకార, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాత, రజాకార్ల వంటి కుటుంబ పాలన సాగించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు పగటి కలలు మానాలని ప్రముఖ సామాజిక, ఆర్థికవేత్త ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అభిప్రాయపడ్డారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాసీ పేద ప్రజల విద్య, వైద్య రంగాలను కేసీఆర్ విధ్వంసం చేశారని మండిపడ్డారు. గ్రామ పంచాయతీలను భ్రష్టు పట్టించి, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించి, ప్రజాధనాన్ని దోచుకొని రాష్ట్రానికి ఏడు లక్షల 50 వేల కోట్ల రూపాయల అప్పు మిగిల్చాడని దుయ్యబట్టారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నిటికీ తానే ఎన్నికల ఖర్చు పెడతానని చెప్పుకునే స్థాయికి దోచుకొని దాచుకొని, మళ్లీ రాష్ట్రంలో నేనే వస్తానని చెప్పుకోవడానికి కల్వకుంట చంద్రశేఖర రావుకు ఎలాంటి అర్హత లేదన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణ ప్రజాస్వామ్యంలో ఇక స్థానం లేదన్నారు. గత ప్రభుత్వంలో అవినీతిపరులైన రాజకీయ నాయకులను, అధికారులను చట్టరీత్య శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్, ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, వాసు నాయకులు డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ వంగాల సుధాకర్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ లక్ష్యాలను వంద శాతం సాధించేలా పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. మహబూబాబాద్ జిల్లా అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో మొక్కలు నాటే ప్రదేశాలు గుర్తించి మొక్కలు నాటాలని అధికారులను అదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు . జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్స్ కలిపి పోలీస్ శాఖ తరపున లక్ష మొక్కలు టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి రావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ శరవయ్య, ఐటీ సెల్ ఇన్ స్పెక్టర్ నరేందర్, ఆర్ఐలు భాస్కర్, సాంబశివరావు, అనిల్, అధికారులు, సిబ్బంది. పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ నిల్వలు



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను కొంతమంది వ్యక్తులు వారి సొంత ప్రయోజనాల కోసం వ్యాపార నిమిత్తం ఇసుకను నిల్వ చేసుకున్నారు. ఇక్కడ నుంచి జిల్లా కేంద్రానికి మండల కేంద్రానికి వివిధ గ్రామ పంచాయతీలకు ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మండలంలో ఇసుక యధేచ్చగా రాత్రి పగలు అనకుండా రవాణా చేస్తున్నారు. ఈ రవాణాకు ఎలాంటి అనుమతులు, పర్మిషన్లు లేవు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకొని, అక్రమంగా నిల్వ చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని స్థానికులు,ప్రజాసంఘాలు కోరుతున్నారు.

# విద్యార్థులకు స్కూల్ సామాగ్రి అందజేత



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని తిమ్మరాయన్ పాడు ఎంపీపీ ఎస్ స్కూల్ విద్యార్థులకు శనివారం మంద నరేష్ మిత్ర బృందంతో కలిసి విద్యార్థులకు కావలసిన బుక్కులు,పెన్నులు, కంపాక్స్ విద్యార్థులకు కావలసిన ఇతర సామాగ్రిని వితరణ చేయడం జరిగింది. స్కూల్ ప్రిన్సిపల్ పూదోట శౌరీలు, టీచర్ రోజమ్మ, మిత్ర బృందం పాల్గొనడం జరిగింది.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవితం ఆదర్శనీయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో భారతీయ జన సంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 123వ జయంతి సందర్భంగా మండల కోఆర్డినేటర్ నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం ఐక్యత, సమగ్రత కోసం తన జీవితమంతా అంకితం చేసిన ఆదర్శ వ్యక్తి అని ఆయన అన్నారు. దేశంలోని పౌరులందరికీ ఇతని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మొర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీకాంత్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల నాగరాజు, సీనియర్ నాయకుడు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, బూత్ అధ్యక్షులు కోమటి రాజ శేఖర్ తదితరులున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశాయిపేట్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు వారి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం 2024లో జరిగిన వరంగల్ పార్లమెంట్ ఎన్నికలపై వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల నాయకులు, డివిజన్, మండల ఇంచార్జి/ అధ్యక్షులు, జిల్లా పదాధికారులతో కలిసి పార్లమెంట్ ఎన్నికలపై రివ్యూ మీటింగ్ వరంగల్ పార్లమెంట్ ప్రబారి డాక్టర్ మురలీధర్ గౌడ్, పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ తో కలిసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో భారీ మెజారిటీ సాధిచడంలో కార్యకర్తలు, నాయకులు క్రియాశీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు చేసిన కృషిని అభినందించారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా ఇంతకు రెట్టింపు ఉత్సహంతో పనిచేసి పార్టీని సంస్థాగతంగా మరింత బలపర్చుకోవాలని డివిజన్ వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా పదాధికారులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



### జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళి..

మానవతావాది, మహోన్నతమూర్తి బాబు జగ్జీవన్ రామ్ పుణ్యతిథి సందర్భంగా ఆ మహనీయుడికి బీజేపీ నాయకులు వినమ్ర శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేషాయిపేట్ 13వ డివిజన్ లో గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, పార్లమెంట్ ఇంచార్జి మురళిధర్ గౌడ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా పదాధికారులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు భరోసా సీఎం సహాయ నిధి

## ఎంపీ డా.కడియం కావ్య



**వరంగల్ వాయిస్, జఫర్ గఢ్ :** మండలంలోని కునూరుకు చెందిన పోతోజు రేవతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 1లక్ష 60వేల రూపాయల ఎల్ఓసీని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదల వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు ఆర్థిక సాయన్ని బాధితులకు అందిస్తోందని అన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు ఎల్ఓసీ అందజేత



**వరంగల్ వాయిస్, వేలేరు :** మండల కేంద్రానికి గ్రామానికి చెందిన బిల్లా రాధ భర్త రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే దృషికి రావడంతో వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా 2లక్ష 30వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

## అజ్మీరా వెంకట్ నాయక్



**వరంగల్ వాయిస్, బాల సముద్రం :** లంబాడా హక్కుల పోరాట సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కరపత్రాలను ఎల్ హెచ్ పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలో జూలై 13,14 తేదీలలో లంబాడీల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ క్లాసులకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలందరూ పాల్గొంటున్నారని తెలిపారు. ప్రధానంగా లంబాడీల గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని చేర్చాలని, అదేవిధంగా మా తండాలో మా రాజ్యం రావాలని గత 25 సంవత్సరాల ఎల్ హెచ్ పీఎస్ సుదీర్ఘ పోరాటం ఫలితంగా తండాల గ్రామ పంచాయతీ సాధించుకున్నామని, అదే పోరాట స్ఫూర్తితో గోర్ బొలిని కూడా రాజ్యాంగంలోకి చేర్పించే దాకా పోరాటం ఆపేదే లేదని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతిని తక్షణమే ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, దేశంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లంబాడీల రాజ్యాధికారం దిశగా పోరాడాలని, అందు కోసమే లంబాడీలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాదావత్ భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, శ్రీను నాయక్, లాలు నాయక్, శ్రీకాంత్ స్వామి నాయక్ పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




వరంగల్ వాయిస్, హనుమకొండ : భారతదేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జగజీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త అని భారత పార్లమెంట్ లో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. దేశంలో ఎన్నో చట్టాలను ప్రవేశపెట్టిన ఘనత బాబు జగ్జీవన్ రామ్ కే దక్కుతుందన్నారు. 1957లో ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్ లలో రిజర్వేషన్ మొదటి సారి అమలులోకి తెచ్చారని అన్నారు. ఆహార మంత్రిగా దేశాన్ని తీవ్ర దుర్భిక్షం నుంచి తప్పించి మొదటిసారి హరిత విప్లవం వైపు నడిపించిన ఘనత బాబు జగ్జీవన్ రామ్ దే అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ డిపార్టుమెంటు నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, ఏ.నాగరాజు, స్వామి చరణ్, జిల్లా ఎస్సీ డిపార్టుమెంటు డాక్టర్ పి.రామకృష్ణ, జిల్లా ఐఎన్టీయూసీ చైర్మన్ కూర వెంకట్, మాజీ కార్పొరేటర్ ఏ.నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్ యాదవ్, బండారి జనార్ధన్ గౌడ్, మొహమ్మద్ అంకూస్, సయ్యద్ అజ్గర్, మహమ్మద్ ఖుర్షీద్, నల్ల సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్ యూఐ, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ కార్యాలయంలో..



వరంగల్ వాయిస్, హనుమకొండ : బాబు జగ్జీవన్ రావు 39వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సీపీఐ ఆఫీసులో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు దేశానికే దళిత ఉప ప్రధానిగా, దళితులకు ఎనలేని సేవ చేశారని ఆయన కొనియాడారు. దళితుల హక్కుల కోసమై, దళితుల సమస్యల పరిష్కరానికి ఆయన చాలా వరకు దోహదపడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా, జక్కు రాజు గౌడ్, స్టాలిన్, కుంట పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలాలతో మాజీ ఎమ్మెల్యే బీజేపీ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు వేంకటేశ్వర రావులు నివాళు లర్పించారు. అనంతరం ప్రధాని మోదీ కన్న తల్లి పేరిట మొక్కలు నాటండి పిలుపులో భాగంగా వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఒకే ప్రధాని, ఒకే జెండా, ఒకే చట్టం అనే నినాదంతో శ్యామ్ ప్రసాద్ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేశం కోసం శ్యామ్ ప్రసాద్ చేసిన త్యాగం మరువలేనిదని, అతని ఆశయాలను బీజేపీ కార్యకర్తలు కొనసాగించాలని పిలుపు నిచ్చారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా శ్యామ్ ప్రసాద్ మంత్రి వర్గం నుంచి బయటకు వచ్చి జన సంఘ్ ను స్థాపించారన్నారు. ప్రధాని మోదీ హయాంలో ఆర్టికల్ 370ని రద్దు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శశివర్ధన్ రెడ్డి, హిందు భారతి, నాగమణి పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



వరంగల్ వాయిస్, మహాదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా వ్యక్తి గత పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ పలిమెలలోని కేజీబీవీ పాఠశాలను అకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో పెండింగ్ లో ఉన్న మరమత్తు పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కళాశాల ఆవరణలోని ఖాళీ ప్రాంతంలో మునగ, కరివేపాకు, చింత తదితర మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులు 220 మంది వరకు ఉన్నారని అదనపు మరుగుదొడ్లు మంజూరు చేయాలని ఎస్ఓ మహేశ్వరి విజ్ఞప్తి చేయగా మంజూరు చేస్తామని తెలిపారు. పాఠశాలలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. దోమలు వ్యాప్తి జరుగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పీఆర్ ఈ ఈ దిలీప్, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో శ్రీనివాసరావు, కేజీబీవీ ఎస్ఓ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు (మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్) ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, వసతి గృహాలు, పాఠశాలలు, తదితర పబ్లిక్ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయి, డీపీఓ హరిప్రసాద్, ఏరియా హాస్పిటల్ సూపరెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్ అంబరీష్, తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్



వరంగల్ వాయిస్, వరంగల్ : తూర్పు నియోజకవర్గంలోని 27 డివిజన్ ఎల్బీఆర్ కాలనీలో మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా సంఘసంస్కర్తగా తన పరిపాలన దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలు అందించారు. భారతదేశంలో దళితుల అభ్యున్నతికి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప నాయకుడని కొనియాడారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. 27వ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు దౌడు నాగరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, రమ్య, కొండపర్తి శ్రీలత, ఓరుగంటి రేణుక, ఎస్.కె రబ్బాని, తురక పద్మ, నాజియా, స్వరూప, నాయకులు దౌడు నాగరాజ్, ఎలదండ శ్రీనివాస్, శ్యామల, మార్క్, మాని కనకరాజు, మేదర శ్రీను, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్‌కు న్యాయవాదుల ఘన నివాళి



వరంగల్ వాయిస్, హనుమకొండ : భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ల అధ్వర్యంలో న్యాయవాదులు ఆయన చిత్ర పటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ బైరపాక జయకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం, బహుజనులను రాజకీయంగా చైతన్యం చేయ్యడం కోసం జగ్జీవన్ రామ్ అహర్నిశలు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్ బాబు, జనరల్ సెక్రటరీ లడె రమేష్ , టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ స్పోక్స్ పర్సన్ వేముల రమేష్ , ఎంఎల్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొంగర పూర్ణచందర్, ఎంఎల్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాగభూషణం, సీనియర్ న్యాయవాదులు సూర్య రావు, డేవిడ్ రాజ్ కుమార్, కొండపాక కృష్ణ, జన్ను ఆనంద్ కుమార్, మహిళా నాయవాదులు చిలుక భాగ్యమ్మ, హనుమకొండ బార్ ఈసీ అనిత, రమాదేవి, సౌందర్య, చిట్యాల రమేష్, హనుమకొండ బార్ ఈసీ మెంబర్ అచ్యుత్ కుమార్, జేఎస్ఎం విజేందర్, వరంగల్ బార్ ఈసీ మెంబర్ పెండ్యాల అనిల్ కుమార్, దుబ్బ అనిల్, ఈరా మహేందర్, ఎలామాద్ర రవి, మేరుగు సుభాష్, ఫణి, అరుణ్, శ్రీనివాస్, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్స్ కందుకూరు రజినీకాంత్, పిల్లి కార్తీక్, శివకుమార్, జాఘువా తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో..



వరంగల్ వాయిస్, పరకాల : పట్టణ బస్టాండ్ కూడలిలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహా కమిటీ అధ్యక్షుడు బొచ్చు అనంతరావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేయడం జరిగింది. ఈ కార్యకమానికి ముఖ్య అతిథులుగా ఒంటెరు సాంబన్న, మాజీ ఎంపీటీసీ ఈర్ల చిన్ని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శనిగరపు సమ్మన్న, మాజీ సర్పంచ్ నార్లపూర్ కొడిపాక రాజన్న, మడికొండ కుమార్, సాంబయ్య, మాణిక్యమ్మ, చెర్లపెల్లి రాధమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ పాల్గొన్నారు.

# కలెక్టర్ సుడిగాలి పర్యటన



**వరంగల్ వాయిస్, కురవి :** మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సుడిగాలి పర్యటన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ స్కూల్, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు) అంగన్వాడీ కేంద్రం, ఆయుర్వేద వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య కేంద్రంలో ఓపీ పెంచాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వారికి కావలసిన వసతులు, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, విద్యుత్ నిరంతరం అందేలా చూడాలని, డిజిటల్ విద్యా బోధనలు కంప్యూటర్స్ ల్యాబ్ ద్వారా నిర్వహించాలన్నారు. నిత్యం మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, వసతి గృహాల్లో ఉండే బాలికల రక్షణ నిమిత్తం నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయుర్వేద వైద్యశాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందిస్తూ, ప్రైమరీ విద్యను వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని, ఉపాధ్యాయుల హాజరు పట్టిక వివరాలను పరిశీలించి, ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థిని ,విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా బడికి హాజరు అయ్యేలా చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో డా.విరాజిత, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సత్యవతి, ప్రధాన ఉపాధ్యాయులు వహీద్, ఉప్పలయ్య, తహసిల్దార్ సునీల్ రెడ్డి, ఏంపీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఏఈఓగా పనిచేస్తూనే ఏవో పోస్ట్

## జావేద్ ఖాన్‌ను అభినందించిన మండల ప్రజలు




**వరంగల్ వాయిస్, మరిపెడ :** కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించాడు ఓ యువకుడు. గత సంవత్సరం మే 26న టీఎస్పీఎస్సీ నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లో భాగంగా తాజాగా టీజీఎస్‌ఎస్సీ విడుదల చేసిన ఫలితాలలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ జావీద్ ఖాన్ బురహానపురం గ్రామ ఏఈఓగా పనిచేస్తూనే ఏవోగా సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా జావీద్ ఖాన్ మాట్లాడుతూ, తాను స్థానిక శ్రీ రాఘవ విద్యానికేతన్ లో చదువుకున్నానని, పదో తరగతిలో 540 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచానని, మెదక్ లోని బసంత్‌పూర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో అగ్రికల్చర్ డిప్లమా 9.25 ఓజీపీఏతో పూర్తి చేశానని, తరువాత అగ్రిసెట్ ఎగ్జామ్ రాసి రాష్ట్రస్థాయిలో ఆరవ ర్యాంక్ సాధించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ రాజేంద్ర నగర్ లో అగ్రికల్చర్ బీఎస్సీ లో సీటు సాధించి 8.6 ఓజీపీఏతో డిస్టింక్షన్ తో ఉత్తీర్ణత సాధించానని తెలిపారు. తరువాత 2016లో టీఎస్పీఎస్సీ కండక్ట్ చేసిన ఏఈఓ పరీక్షలో సెలెక్ట్ అయ్యి బురాన్ పురం ఏఈఓ గా నియమించడం జరిగిందని అన్నారు. టీఎస్పీఎస్సీ నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి పరీక్షలో 148 పోస్టులు ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 8500 మంది పోటీపడ్డారని, జూన్ 26న విడుదల చేసిన ఫలితాలలో తాను సెలెక్ట్ కావడం ఆనందంగా ఉందన్నారు. మండల కేంద్రానికి చెందిన జావేద్ ఖాన్ చిన్న వయసులోనే మండల స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో స్థానికులు జావేద్ ను అభినందించారు.

# త్యాగశీలి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల శ్మశాన వాటికలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ విచ్చేసి మొక్కలు నాటి మాట్లాడారు. జూన్ 23 డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ నుంచి జూలై 06 వారి జయంతి వరకు నిర్వహించే కార్యక్రమాలలో ఒకటైన పర్యావరణ పరిరక్షణ కోసం భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా మొగిలిచర్ల శ్మశాన వాటికలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. త్యాగశీలి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఏక్ దేశ్ మే ధో ప్రధాన్, దో విధాన్ దో నిషాన్ నహి చేలే గా ఒక దేశంలో ఒకే ప్రధానమంత్రి, ఒకే జెండా, ఒకే విధానం ఒకే చట్టం, ఉండాలి అని చెప్పిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, సొసైటీ డైరెక్టర్ లెంకలపెల్లి స్వామి, డివిజన్ నాయకులు రాదారపు మల్లికార్జున్, నరిశెట్టి చంద్రమౌళి, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డెంగీ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** డెంగీ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా స్థాయి కో–ఆర్డినేషన్ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో చాలా మంది చెరువులు వాగులు చలిమల ద్వారా వచ్చే సహజసిద్ధమైన తాగునీటిని ఉపయోగిస్తున్నారని, కానీ, అలా చేయడం సురక్షితం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే స్థానికంగా ఉండే ఆశ కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు, మహిళ సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీని ద్వారా స్థానికంగా గ్రామ ప్రజలకు వారు అవగాహన కల్పిస్తారని కలుషిత నీరు త్రాగడం వల్ల అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఎక్కడపడితే అక్కడ నీటిని త్రాగవద్దని సూచించారు. పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్ ను అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. అటవీ ప్రాంతంలో ఉండే గుత్తి కోయ గ్రామాలలో మలేరియా, డెంగీ వ్యాధులను నియంత్రించడానికి ప్రత్యేక అధికారులు స్థానిక అధికారులు నిరంతరం గ్రామాలను పర్యవేక్షిస్తూ పరిశీలిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రి సూరింటెండెంట్ జగదీశ్వర్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ లాల్, ప్రోగ్రాం అధికారి రవీందర్, ఏటూరు నాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరెండెంట్ డాక్టర్ సురేష్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జినకల దుర్గారావు, ఎంపీడీవోలు, హెచ్ఈ భాస్కర్, ఏపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ హైజీన్ పోస్టర్ విడుదల



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా సైబర్ హైజీన్ అనే పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఉండాలంటే చేయవలసిన పనులు, చేయకూడని పనులు గురించి ప్రచురించడం జరిగింది. ఈ పోస్టర్ ను ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో, గవర్నమెంట్ ఆఫీసులు, స్కూల్స్, కాలేజీలు, ఇతర ప్రదేశాల్లో అంటించి ప్రజలకు సైబర్ నేరాల మీద అవగాహన కల్పించాలన్నారు. ధృడమైన, పొడవైన పాస్వర్డ్ లను ఉపయోగించాలని, వాటిని తరచుగా మార్చుతూ ఉండాలని సూచించారు. మీ సోషల్ మీడియా ఖాతాలలో డేటా గోప్యత సెట్టింగ్స్ ఉపయోగించి, వాటిని ప్రైవేట్‌గా ఉంచాలన్నారు. ఉపయోగంలో లేనపుడు మీ కంప్యూటర్, మొబైల్ ఫోన్ లాక్ చేయాలని తెలిపారు. మీ ఆన్లైన్ ఖాతాల కోసం రెండు దశల ప్రామాణీకరణ( టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్) ఉపయోగించండని పేర్కొన్నారు. మొబైల్ అప్లికేషన్లను ఇన్స్టాల్ చేసేటప్పుడు కాల్స్, కాంటాక్ట్స్, మెసేజెస్, మీడియా, లోకేషన్ ఆక్సెస్ అవసరం ఐతేనే ఆలోచించి ఇవ్వండని తెలిపారు. వెబ్ సైట్ బ్రౌస్ చేసేటప్పుడు ముందు urlలో https// కోసం తనిఖీ చేయండన్నారు. అపరిచితులు పంపిన లింక్స్ లేదా వెబ్ సైట్ లలో పాప్ అప్స్ క్లిక్ చేయకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా సైబర్ నేరాల బారిన పడవద్దని ఫోన్‌కు వచ్చే ఎటువంటి అసంబంధిత లింక్ ను ఓపెన్ చేయవద్దన్నారు. అనుకోని విధంగా మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి డయల్ చేయాలని, లేకుంటే www.cybercrime.gov.inకు లాగిన్ చేసి కంప్లైంట్ నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మహబూబాబాద్ తిరుపతి రావు, ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ శరవయ్య, కురవి ఎస్ఐ గోపి, రూరల్ ఎస్ఐ దీపిక, గన్‌మెన్ శ్రీధర్ పాల్గొన్నారు.

# తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తలసేమియా బాధితులను కాపాడేందుకు దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి, వర్ధంతి సందర్భంగా దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, హనుమకొండ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి విచ్చేసి దాస్యం ప్రణయ్ భాస్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా వచ్చిన వరంగల్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్మణీయంగా నిలిచిపోయే ప్రజా నాయకుడు స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ అని, జిల్లా అభివృద్ధి కోసం, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం అహర్నిశలు కృషిచేశారని తెలిపారు. అదేవిదంగా ఆ రోజుల్లో కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేసి ప్రత్యేక గుర్తింపు, ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అభినందించారు. తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్త దాన శిబిరం ఏర్పాటుచేసిన దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డా.మొహమ్మద్ తహర్ మసూద్, దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు ఐతరాజుల నరేష్, అభిమానులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# కేయూ దూరవిద్య కేంద్రంలో క్లీన్ అండ్ గ్రీన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో శనివారం సంచాలకులు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో దూరవిద్య కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో ఉన్నపిచ్చి మొక్కలను తొలగించి చెత్తా చెదారం లేకుండా క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. అనంతరం సంచాలకులు ప్రొఫెసర్ రామచంద్రం ఉద్యోగులతో మాట్లాడుతూ ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో క్రిమి కీటకాలు దరి చేరకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. పరిశుభ్రతతోనే పరిసర ప్రాంతాలు, మన ఆరోగ్యం బాగుంటాయని పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ఉద్యోగులు స్వచ్ఛందంగా పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసినందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ సంగాణి మల్లేశ్వర్, బట్టి వెంకట గోపీనాథ్, డాక్టర్ వి.జగన్. డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, దూరవిద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల రిటైర్‌మెంట్ బెనిఫిట్ పెంచాలి

## సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, జులై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్ కు 2 లక్షలు, హెల్పర్స్ కు 1 లక్ష చెల్లించాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద శనివారం రిలే నిరాహార దీక్షలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు అంగన్వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారని, ఈ సమ్మె సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్స్ కు రూ.2 లక్షలు, హెల్పర్స్ కు రూ.1 లక్ష పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజులు సమ్మె జరిగిన పరిస్థితి, ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, హామీల్లో ఒకటైన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ గురించి కూడా వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి, ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లామన్నారు. ఐనప్పటికి పై అంశాలను పరిగణలోకి తీసుకోక పోవడం అన్యాయమని మండిపడ్డారు. పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ను జులై 24 తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమని రమేష్ దుయ్యబట్టారు. అంగన్వాడీ ఉద్యోగులకు తీవ్రంగా నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. మొదటిరోజు రిలే నిరాహార దీక్షలోయూనియన్ నాయకులు కె.రమాదేవి, కె.జమున, ఆర్.సరోజన, కె.కౌసల్య. జి.ఉమామహేశ్వరి. పి.సుగుణ, రాజమ్మ, బుచ్చమ్మ, యం.సుగుణ, పి.లక్ష్మి, పి.వెంకటమ్మ పాల్గొన్నారు.

# ఎంఎన్‌సీకి ఎంపికైన వాగ్దేవి ఇంజినీరింగ్ విద్యార్థులు

## రూ.10 లక్షలకు పైగా వేతనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజ్ రెండూ విద్య, ప్లేస్‌మెంట్‌లో నైపుణ్యం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో తదుపరి తరం నిపుణులను రూపొందిస్తున్నాయి. తమ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్సెస్ బ్రాంచ్‌లకు చెందిన ఐదుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు ఫ్యాక్ట్‌సెట్ రీసెర్చ్ సిస్టమ్స్ ఇంక్., నార్వాక్, యూఎస్‌ఏ ప్రముఖ గ్లోబల్ అమెరికన్ ఫైనాన్షియల్ డేటా, సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రతిష్ఠాత్మకమైన ప్లేస్‌మెంట్‌లను పొందినట్లు రెండు ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్‌లు తెలిపి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విద్యార్థులకు సంవత్సరానికి రూ.10 లక్షల కంటే ఎక్కువ జీతం దించబడింది. ఈ ఘనత వాగ్దేవి కళాశాల అధ్యాపకుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డా.కె.ప్రకాష్, డా.పి.ప్రసాదరావులు విద్యార్థులను సన్మానించి, అభినందిం చారు. మా విద్యార్థులు సాధించిన విజయాలను చూసి గర్విస్తున్నామన్నారు. విద్యార్థులు అసాధారణమైన నైపుణ్యాలు, ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. దీంతో వారు ఫ్యాక్ట్‌సెట్‌కు విలువైన ఆస్తులుగా మారారని, ఇలాంటి మరిన్ని విజయగాథల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాణి దేవి మాట్లాడుతూ మా అధ్యాపకుల అవిశ్రాంత కృషి, సంస్థ అత్యాధునిక మౌలిక సదుపాయాల ఫలితంగా తమ విద్యార్థుల విజయం సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు వారి వృత్తిపరమైన ప్రయత్నాలలో రాణిస్తారని విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యాక్ట్‌సెట్ ఎంపిక చేసిన విద్యార్థులను, ప్రాంగణ నియామకాల అధికారి బర్కత్ బృందాన్ని కళాశాల డీన్‌లు,హెచ్ఓడీలు అభినందించారు. ఈ ప్రశంసా కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.తిరుపతిరావు, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం.శశిధర్ పాల్గొన్నారని, పరిశోధన, పరిశ్రమల అనుసందాన సహ డీన్ డాక్టర్ సీహెచ్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

# సమాజ హితులు వైద్యులను ఆదరించాలి

## నేత్ర పర్వంగా లయన్స్‌చే డాక్టర్లకు సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్యో నారాయణో... హరీ అన్నట్లుగా సమాజంలో ఉత్తమ సేవలు అందించే వైద్యులను ఆదరించాలని, వైద్య వృత్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అంతర్జాతీయ లయన్స్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో నేత్ర పర్వంగా నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా డాక్టర్స్ హానరింగ్ చైర్మన్ డా.ఆకారపు రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో 45 మంది వైద్యులు, వైద్య రంగంలో పనిచేస్తున్న అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ డా.లక్షణమూర్తి, డా చంద్రబాయి, డా. విశ్వనాథం, డా.సూర్యనారాయణ, సత్యనారాయణ మూర్తి లాంటి ఎందరెందరో వైద్యుల నిలయం ఓరుగల్లు నగరమని కొనియాడారు. ఈ రంగంలో లాభాపేక్ష లేకుండా రోగులకు సేవలందించే వైద్యులను గుర్తించి సత్కరించడం లయన్స్ సంప్రదాయమన్నారు. మల్టీపుల్ కౌన్సిల్ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరి జీవితం విద్యుడితో ముడిపడి ఉంటుందని అన్నారు. కరోనా కష్ట సమయములో కుటుంబాలను వదిలి రోగులకు సేవలందించరాని కొనియాడారు. మొదటి ఉప జిల్లా గవర్నర్ డా.చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ భారతరత్న బీసీ రాయ్ సేవలు వైద్యులందరికి ఆదర్శమన్నారు. అందుకే దేశమంతటా బీసీ రాయ్ జన్మదినం సందర్భంగా వైద్యుల సేవలు స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. డా. రమాక శ్రీనివాస్, డా.ఎన్. గోపాల్ రావు, డా.పెసరు విజయచందర్ రెడ్డి, డా.పిల్లి సాంబశివ రావు, డా. జి.చంద్రశేఖర్, డా.బి.బాలాజీ, డా.పి.ప్రవీణ్ రెడ్డి, డా.ఏ సమ్మి రెడ్డి, డా.కె సుధాకర్ రెడ్డి, డా.లవకుమార్ రెడ్డి, డా.కుందూరు రాజేందర్ రెడ్డి, డా.వి.నరేష్ కుమార్, డా.దిడ్డి శ్రవణ్ కుమార్, డా.తోట వేణుగోపాల్, డా.ప్రేమనంద రావు, డా.కె అశోక్ కుమార్, డా.దాసరోజు రమేష్ లాంటి 45 మంది ప్రముఖ వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండవ ఉపజిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్ లు డా.కె సుధాకర్ రెడ్డి, డా.రాజేందర్ రెడ్డి, కన్నా పరశురాములు, ముచ్చ రాజి రెడ్డి, టి.లక్ష్మినర్సింహా రావు, డా.లవకుమార్ రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాస రావు, జిల్లా నాయకులు డా.తాళ్ల రవి, డా.లక్ష్మినారాయణ, సైయ్యద్ హబీబ్, డా.అజిత్ కుమార్, రేవూరి రమణా రెడ్డి, కటంగూరు రాంగోపాల్ రెడ్డి, పెద్ది రేవతి, కోదండపాణి, డా సురేష్ కుమార్, మార్కాల యాదిరెడ్డి, వివిధ క్లబ్‌ల బాధ్యులు పాల్గొనగా మాస్టర్ అఫ్ సెర్మోనీగా పెండం వేణుమాధవ్, నరేందర్ వ్యవహారించారు.

## బస్వరాజ్ సారయ్యను కలిసిన గుండేటి నరేంద్ర కుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకొని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ వారి ఇంటికి వెళ్లి వారిని మర్యాదపూర్వక కలిసి శాలువాతో సన్మానించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట 20వ డివిజన్ అధ్యక్షుడు కుసుమ సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోట బాలరాజు, జన్నువేణు, ఫయాజ్బ సారంగపాణి, పెండ్యాల కొమురయ్య, స్వరాజ్, దయాకర్, కట్కూరు సాయి, చిరంజీవి, దేవునూరి రవి, చంద్రశేఖర్, గోవర్ధన్, లక్ష్మినారాయణ, నటరాజ్, బిట్టు, మకబుల్, శివ, హఫీస్, హాబీబ్ పాషా, దేవరాజు, వంశీ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ సురేష్ లాల్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడిగా నియమించబడిన ప్రొఫెసర్ బానోతు సురేష్ లాల్ ను వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు శనివారం యూనివర్సిటీ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క బహుమతిగా ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. సురేష్ లాల్ వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యత నిర్వహిస్తున్నారు . ఈ కార్యక్రమంలో ఎండీ సిరాజుద్దీన్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఎదుర్కొంటున్న సమస్యలను, విద్యార్థులకు మంచి సౌకర్యాలను కల్పించే దిశగా కృషి చేయాలని ఆశించారు. ప్రొఫెసర్ విజయబాబు, వీరేందర్ నిమ్మల శ్రీనివాస్, సుధాకర్ రావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిచెందిన సంఘటన మరిపెడ మండలంలోని బాల్ని ధర్మారం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. గ్రామంలోని గౌని శిరీషకు చెందిన పాడి గేదె మేత మేసుకుంటూ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్ గురై మృతిచెందినట్లు గౌని శిరీష తెలిపారు. ఎద్దు విలువ రూ.50 వేలకు పైనే ఉంటుందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని ఆత్మకూర్, అక్కంపేట గ్రామాలకు చెందిన జాగిలపు విజయ, కందకట్ల లక్ష్మిలు ఇటీవల వివిధ కారణాలతో మరణించడంతో విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, కిసాన్ మోర్చా నియోజకవర్గ కో కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, ఆర్టీఐ అక్ట్ జిల్లా కన్వీనర్ ఏదులాపురం శ్రావణ్ కుమార్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, మాజీ ఎంపీటీసీ భయ్యా రామరాజు, మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణు, మండల కార్యదర్శి రవ్వ శివప్రసాద్, భయ్యా పైడి, మాజీ వార్డు మెంబర్ రెమిడి స్రవంతి, మల్లారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, బూత్ అధ్యక్షులు మాచర్ల స్వామి, పాయిరాల రాజేందర్, కుక్కల కుమారస్వామి, భయ్యా శ్రీనివాస్, పీసాల సాంబయ్య, వరికెల రామకృష్ణ, గుండెబోయిన మధు, వెలదే శివశంకర్, ఓంమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్మురేపుతున్న కల్కి వసూళ్లు



## 800కోట్లకు చేరినట్లు చిత్రబృందం పోస్ట్

ప్రభాస్ కీలక పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2829 ఏడీ' హవా కొనసాగుతోంది. యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో అత్యంత ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తొలిరోజే రూ.191.5 కోట్లు వసూలు చేసిన 'కల్కి' ఇప్పుడు రూ.800కోట్లను తన ఖాతాలో వేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ మైథాలజీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరడమే తరువాయి అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'కల్కి 2829 ఏడీ' విడుదలకు ముందే అమెరికాలో ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా అక్కడ ఈ చిత్రం నిడివి తగ్గించినట్లు తెలుస్తోంది. దాదాపు 3 గంటలపైన నిడివి ఉన్న 'కల్కి'.. ఇకపై 2.45 గంటలు ప్రదర్శితం కానుంది.

## మరో మూడేళ్లకు.. కల్కి సెకండ్ పార్ట్

ఇప్పుడు విడుదలయింది మొదటి పార్టు అని, రెండో పార్టు ఇంకో మూడు సంవత్సరాల తరువాత విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సినిమాలో ప్రభాస్ పాత్ర నిడివి చాలా తక్కువయిందని టాక్ వినిపించింది అన్న సమాధానానికి దర్శకుడు రెండో పార్టులో ఎక్కువ ఉంటుంది అని చెప్పారు. ఈ సినిమా ఫస్ట హాఫ్ అయ్యేసరికి చాలామంది ప్రేక్షకులకి అర్థం కాలేదు. కాంప్లెక్స్‌లో సన్నివేశాలని కొంచెం వేరేగా చూపిస్తే నిడివి తగ్గి ఉండేదని చెప్పారు. ఆ విమర్శని నేను పాజిటివ్ గానే తీసుకుంటున్నాను అని చెప్పారు నాగ్ అశ్విన్. అలాగే సినిమా అయ్యాక డబ్బింగ్ కూడా బాగోలేదని సామాజిక మాధ్యమాల్లో బాగా విమర్శలు వచ్చాయి. ఆ పాత్ర వేసినవాళ్ళే డబ్బింగ్ చెపితే బాగుంటుంది అని చెప్పించాం, కానీ అది పట్టినట్టు ఉందని తరువాత అర్థం అయింది అని నాగ్ అశ్విన్ చెప్పారు.

# రాజమౌళిపై నెట్‌ప్లిక్స్ డాక్యుమెంటరీ











'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్'లతో ప్రపంచాన్ని ఆకర్షించిన రాజమౌళిపై నెట్‌ప్లిక్స్ డాక్యుమెంటరీ రూపొందించింది. దీని స్ట్రీమింగ్ తేదీని, ఇందులో ఏం చూపనున్నారో తెలుపుతూ తాజాగా ఆ సంస్థ పోస్ట్ పెట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. 'ఒక మనిషి.. అనేక బ్లాక్‌బస్టర్‌లు.. అంతులేని ఆశయం. ఈ లెజెండరీ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? ఎన్ని సంవత్సరాలు పట్టింది? ఇలాంటి అంశాలతో 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది. ఆగస్టు2 నుంచి నెట్‌ప్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది' అని సంస్థ పేర్కొంది. దీన్ని అనుపమా చోప్రా సమర్పించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో పలువురు హాలీవుడ్ దర్శకులు, సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోలు కూడా ఈ దర్శక ధీరుడితో వారి అనుబంధాన్ని పంచుకోనున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ప్రస్తుతం మహేశ్‌బాబుతో తీయనున్న ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలకపాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుందని సమాచారం.





# ఉత్తరాది నుంచి వచ్చిన మాల్వి

తెలుగు యువ నటుడు రాజ్ తరుణ్ ఇప్పుడు వార్తల్లో వున్నాడు. అతని ప్రియురాలు అని చెప్పుకుంటున్న లావణ్య అనే అమ్మాయి నార్సింగి పోలీసు స్టేషన్ లో రాజ్ తరుణ్ పై ఫిర్యాదు చేసింది. తనని ప్రేమించి, పెళ్లి చేసుకుంటాను అని మోసం చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే రాజ్ తరుణ్ ఇప్పుడు చేస్తున్న సినిమా 'తిరగబడరా స్వామి' లో కథానాయికగా చేస్తున్న మాల్వి మల్హోత్రాతో కలిసి ఉంటున్నాడని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా తెలిసింది. అయితే లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా రాజ్ తరుణ్ నిజంగానే మాల్వి తో వుంటున్నాడా? ఇంతకీ ఈ మాల్వి ఎవరు అన్న ఆసక్తి వస్తోంది. మాల్వి మల్హోత్రా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో మండి అనే వూర్లో ఒక పంజాబీ కుటుంబంలో పుట్టింది. చదువంతా చండీగఢ్ లో సాగింది, తరువాత ఆమె ముంబాయి షిఫ్ట్ అయి, మాస్టర్స్ ఇన్ కంప్యూటర్స్ కోసం యూనివర్సిటీ అఫ్ ముంబైలో చదివింది. నటిగా ముందుగా కనిపించింది మాత్రం బుల్లితెరపైనే, 2017లో 'ఉడాన్' అనే సీరియల్ లో.. వెండితెరపై ఆమె అరంగేట్రం చేసింది 'హోటల్ మిలన్' అనే సినిమాలో. సుమారు నాలుగేళ్ల తరువాత మాల్వి 'తమస్' అనే ఒక షార్ట్ ఫిలింలో నటించింది.ఆ తరువాత సంవత్సరం మాల్వి ఒక ఓటిటి సినిమాలో నటించింది, కానీ ఆమెకి తగినంత గుర్తింపు రాలేదనే చెప్పాలి. 2023లో 'అభ్యుహం' అనే సినిమాతో మలయాళంలో అరంగేట్రం చేసింది. అదే సంవత్సరం రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటించిన 'తిరగబడరా స్వామి' సినిమాతో తెలుగులో కూడా అరంగేట్రం చేస్తోంది. ఈ సినిమా ఇప్పుడు ప్రచారాలు చేస్తున్నారు, త్వరలోనే విడుదలవుతుంది. రాజ్ తరుణ్ ప్రియురాలు లావణ్య ఆరోపిస్తున్నట్టుగా రాజ్ తరుణ్ ఈ సినిమాలో చేస్తున్న మాల్వి మల్హోత్రాతో వుంటున్నట్టుగా ఆరోపిస్తుంది. మరి అందులో నిజమెంతవుందో మాత్రం వీళ్ళకే తెలియాలి.

# ఆషాఢ బోనాలకు రూ.20 కోట్లు

**విడుదల చేసిన ప్రభుత్వం**

**అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తాం**

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ యేడాది ఆషాఢ బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'తెలంగాణ బోనాల దశాబ్ది ఉత్సవాలు' పేరుతో బోనాల జాతరను నిర్వహిస్తున్నట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఇందుకుగాను అడగగానే రూ.20 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆషాఢ బోనాల ఉత్సవాలను నిర్వహించే అమ్మవారి దేవాలయాల కమిటీలకు బోనాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి పలు ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోనాల జాతర పోస్టర్ ను, తేదీల వారీగా ఆయా దేవాలయాల్లో నిర్వహించే బోనాల జాతర వివరాలను తెలిపే బోనాల జాతర క్యాలెండర్ ను, వీడియో సాంగ్ ను, బోనాల చరిత్ర, సంస్కృతి, పరిణామక్రమం, క్రతువులను తెలుపుతూ సాంస్కృత శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ బోనాలపై రాసిన 'బోనాలు' పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారని మంత్రి సురేఖ ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాఢ బోనాల విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. దేవాలయాలకు సమీపంలోని ప్రైవేట్ హాస్పటల్స్, ఫైర్ స్టేషన్ లతో నిరంతరం కాంటాక్ట్ లో ఉంటూ సహాయ, సహకారాలు పొందే విధంగా ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. బోనాలకు ఎంతమంది హాజరైనా ఇబ్బందులు కలగకుండా మౌలిక సౌకర్యాల కల్పన విషయంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సాగుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు విశ్వవ్యాప్తం చేస్తున్న బోనాల ఉత్సవాలను దిగ్విజవంతంగా చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బోనాలు పుస్తక రచయిత, సాంస్కృతిక శాఖ డైరక్టర్ డా. మామిడి హరికృష్ణ, బోనాల జాతర వీడియో సాంగ్ రూపకల్పనలో పాలుపంచుకున్న బృందాన్ని మంత్రులు, అధికారులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





# స్వాతంత్ర సమర యోధుడు యెర్రయ్య మృతి




**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు నీలారపు యెర్రయ్య (96) మృతి చెందారు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృ హంలో యెర్రయ్య కన్నుమూశారు. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన నీలారపు యెర్రయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. నైజాం సర్కారు విముక్తి తరువాత ఏర్పాటయిన రాష్ట్రంలో జరిగిన తొలి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఘనవిజయం సాధించారు. ఆ తరువాత మరో రెండు సార్లు సర్పంచ్ గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేశారు. అప్పటి కాంగ్రెస్ పార్టీకి చెందిన జనగామ మాజీ ఎమ్మెల్యే కాసాని నారాయణకు స్వయాన భావ అవుతారు. చాల కాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. ఆ తరువాతి కాలంలో జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నారు. ఆయన సతీమణి గత సంవత్సరం మృతి చెందారు. కాగా యెర్రయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు మృత దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు.

# తెలంగాణ ధిక్కార స్వరం ప్రణయ్ భాస్కర్

**కార్పొరేటర్ అభినవ భాస్కర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో వివిధ ప్రాంతాల్లో అన్నదానం, రక్తదాన శిబిరం, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రణయన్న అంటే పిలిచే పేరు మాత్రమే కాదు..జీవితాంతం తలచే జ్ఞాపకం అని యువనేత, జీడబ్ల్యూఎంసీ 60వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ వెల్లడించారు. ప్రణయ్ భాస్కర్ ఏకైక రాజకీయ వారసుడిగా గర్విస్తూ, తన ఆశయాలను ప్రజల ముందుకు తీసుకుపోవడంలో నాకు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటానన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ వర్ధంతి, జయంతి వేడుకలు నగరంలోని అభిమానులు, ఆప్తుల నడుమ అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి సబిత భాస్కర్, కుమారుడు కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తమ నివాసంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుబేదారి ప్రణయ్ మార్గ్ లో వడ్డేపల్లి గ్రామ పెద్దలు, ప్రజలు, యువతతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 31వ డివిజన్ శాయంపేటలో ప్రభుత్వ పాఠశాలలో ప్రణయన్న యాదిలో ఐదుగురు విద్యార్థినులకు రూ.40వేల విలువ కలిగిన సైకిళ్లను అభినవ్ భాస్కర్ అందించి వారిని ఉద్దేశించి ప్రసంగించారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రక్త దాణ శిభిరాన్ని సందర్శించి రక్త దాతలను అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. ప్రణయ్ భాస్కర్ ప్రస్థానంపై యువ రచయిత, బీఆర్ఎస్వి నేత పిన్నింటి విజయ్ కుమార్ రాసిన 'జన హృదయ నేత ప్రణయ భాస్కరుడు' అనే శీర్షికన రాసిన వ్యాసాన్ని ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ చౌరస్తాలో అన్నదానం, కుమార్పల్లి మార్కెట్లో అల్పాహారం కార్యక్రమంలో అభినవ్ పాల్గొని ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ప్రజా, కార్మిక నేతగా అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా బంధువుగా పేరొందిన ప్రణయన్న... మరోవైపు ఆంధ్రా రాష్ట్రంలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయం పట్ల 'అనాడు అసెంబ్లీ వేదికగా జై తెలంగాణ అని గర్జించి ' తన పదవి త్యాగానికి సిద్ధపడి మలిదశ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన మహానేత బిడ్డగా నేను గర్విస్తున్నాననీ అభినవ్ భాస్కర్ అన్నారు. ఇంత గొప్పగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రణయన్న కుటుంబ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.





# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రణయన్న

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్**

**పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రణయన్న అంటూ మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు. మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి – వర్ధంతి సందర్భంగా శనివారం నగరంలోని 10వ డివిజన్ ఆనంద్ నగర్ (లెప్రసి కాలనీ )లో నాయకులు పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... పేద ప్రజలకు సేవ చేసేందుకే ప్రణయన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రణయన్న స్ఫూర్తితో తెలంగాణ కోసం కొట్లాడామని గుర్తు చేశారు. నిత్యం ప్రజా సేవలో కొనసాగుతూ , ప్రజల తరపున పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు ఖలీల్, నాయిమోద్దీన్, రఘు, వరుణ్, హరికృష్ణ, శోభన్, గోపి, రామ కృష్ణ, తస్లిమ్, కాలనీ వాసులు నర్సయ్య, సుబ్బారావు, యాకుబ్, పలువురు పాల్గొన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రణయ్ భాస్కర్ జయంతి, వర్ధంతి వేడుకల్లో వినయ్ భాస్కర్ పాల్గొని ప్రసంగించారు. పద్మాక్షమ్మ గుట్ట వద్ద ఉన్న లెప్రస్ కాలనీతోపాటు ఫాతిమానగర్ దగ్గర ఉన్న హౌస్ ఆఫ్ జాయ్, వడ్డేపల్లి చౌరస్తాలోని ప్రణయ్ మార్గ వద్ద, రెడ్ క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం వద్ద, వడ్డేపల్లిలోని ప్రణయ్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రణయ్ భాస్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com